# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 47, EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 07 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 47 , ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 07 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## భారీ డ్రగ్ రాకెట్ గుట్టు రట్టు

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు**

భారీ డ్రగ్ రాకెట్‌ను ఎన్సీబీ పోలీసులు గుట్టు రట్టు చేశారు. గత రెండు దశాబ్ధాల కాలంలో ఇదే అతిపెద్ద రాకెట్‌గా భావిస్తున్నారు. డార్క్ నెట్, క్రిప్టోల ద్వారా జరుగుతున్న ఎల్ఎస్‌డీ డ్రగ్స్ సరఫరాను పోలీసులు ఛేధించారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగుర్ని అరెస్టు చేశారు. దాదాపు 15 వేల డ్రగ్స్ ప్యాకేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఎల్ఎస్‌డీని లైసెర్జిక్ యాసిడ్ డైథిలమైడ్ అంటారు. ఇదో సింథటిక్ డ్రగ్. ఇది చాలా ప్రమాదకరమైంది. ఇంత భారీ స్థాయిలో ఎల్ఎస్‌డీని స్వాధీనం చేసుకోవడం గత రెండు దశాబ్ధాల్లో ఇదే మొదటిసారి అని ఎన్సీబీ డిప్యూటీ డీజీ జ్ఞానేశ్వర్ సింగ్ తెలిపారు.

## వారం రోజులపాటు
# అధిక ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు**



రాష్ట్రంలో మంగళవారం నుంచి వారం రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణకేంద్రం తెలిపింది. తెలంగాణ అంతటా పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు స్థిరంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. రానున్న ఐదు రోజులు వడగాలులు వీచే అవకాశం ఉన్నదంటూ పలు జిల్లాలకి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాగల మూడు రోజులు కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా ఆవర్తనం కొనసాగుతున్నదని వెల్లడించింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి విదర్భ మీదుగా తెలంగాణ వరకు ద్రోణి విస్తరించిందని పేర్కొన్నది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక లో జాప్యం ఏర్పడింది. సాధారణంగా ప్రతి సీజన్‌లో జూన్ ఒకటి నాటికి క్రమం తప్పకుం డా నైరుతి రుతుపవనాలు కేరళ వద్ద తీరాన్ని తాకి నాలుగైదు రోజుల్లోనే విస్తరిస్తుంటాయి. ఈసారి కేరళ తీరం వైపుగా రుతుపవనాల కదలికలు స్తంభించిపోవడానికి అరేబియా సము ద్రం ఆగ్నేయ ప్రాంత గగనతలంపై 5.8 కి.మీ ఎత్తున ఉపరితల ఆవర్తన ద్రోణి కారణం. మరో 24 గంటల వ్యవధిలో అది అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నది. క్రమంగా ఈ నెల 8 నాటికి తుఫాన్‌గా మారొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది.

# తెలంగాణాలో..బీజేపీ.. పనైపోయిందా..!



### కమలంలో తగ్గిపోతున్న చేరికలు
### ఈటెల రాజేందర్ సర్వేలో తేలిన నిజాలు
### కర్ణాటక ఫలితాలతో తెలంగాణాలో కాంగ్రెస్ జోరు
### మాజీ ఎంపీ పొంగులేటి, మాజీ మంత్రి జూపల్లి హస్తంవైపు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణాలో బీజేపీ పని అయిపోయిందా. దీని మీద ఇపుడు చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. 2019 లోక్ సభ ఎన్నికల్లో దాదాపుగా ఇరవై శాతం ఓట్లు నాలుగు ఎంపీ సీట్లను బీజేపీ తెలంగాణాలో సునాయాసంగా గెలుచుకుని అందరికీ షాక్ ఇచ్చేసింది. అంతటితో బీజేపీ ఊపు అయితే ఆగలేదు. హైదరాబాద్ కార్పోరేషన్ ఎన్నికల్లో అదే జోరుని కంటిన్యూ చేసింది. అక్కడ బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. ఇక దుబ్బాకకు జరిగిన ఉప ఎన్నికల్లో సైతం బీజేపీ అధికార బీయారెస్ మీద గెలిచి సత్తా చాటింది. ఇక హుజూరాబాద్ లో జరిగిన ఎన్నికల్లోనూ బీజేపీ గెలిచి బీయారెస్ కి తామే అసలైన ప్రత్యర్ధి అని చాటి చెప్పింది. దీంతో తెలంగాణాలో సెకండ్ ప్లేస్ లోకి బీజేపీ వచ్చేసిందని ఇంకేముంది ఎన్నికలు ఎపుడు పెట్టినా అధికారంలోకి

మిగతా 2లో...

## గులాబీ ఫస్ట్ లిస్ట్ రెడీ..?

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు**




ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే పార్టీలోని పరిస్థితులు అన్నీ సెట్ అయిపోవాలని గులాబీ బాస్ భావిస్తున్నారు. ఇప్పటికే టికెట్ల విషయంలో కసరత్తు మొదలుపెట్టిన ఆయన.. దశాబ్ది ఉత్సవాల అనంతరం సుమారు 70 మంది అభ్యర్ధులతో మొదటి జాబితాను ప్రకటించనున్నట్టు సమాచారం. ఇప్పటికే చేయించిన పలు సర్వేల ఆధారంగా లిస్టు రెడీ చేసినట్టు తెలుస్తున్నది. ఇక త్వరలోనే వాటిని ఫైనల్ చేసి అనౌన్స్ చేస్తారని తెలిసింది. ఎన్నికల షెడ్యూలు వచ్చేలోపే అభ్యర్ధులను ప్రకటించి ప్రచారానికి తెర లేపాలనే యోచనలో కేసీఆర్ ఉన్నట్టు టాక్.

మిగతా 2లో...

## తెలంగాణ కేసీఆర్ సర్కారుకు
# భారీ ఎదురుదెబ్బ

### జీవో 59ను కొట్టేసిన హైకోర్టు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



తెలంగాణలోని కేసీఆర్ సర్కారుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గతంలో పభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పు పట్టిన తెలంగాణ హైకోర్టు.. ప్రభుత్వ ఆదేశాన్ని తప్పు పట్టింది. ఈ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు చేయటం గమనార్హం. హెటిరో గ్రూప్ ఛైర్మన్.. బీఆర్ఎస్ ఎంపీ పార్ధసారధిరెడ్డికి జరిపిన భూకేటా యింపుల ఇష్యూను తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. పార్ధసారథి రెడ్డి మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న సాయి సింధు ఫౌండేషన్ కు 15 ఎకరాల భూమిని లీజుకు ఇస్తూ 2018లో కేసీఆర్ సర్కారు జీవో 59ను విడుదల చేయగా.. తాజాగా హైకోర్టు తాన్ని కొట్టేసింది. ఆస్తుల్ని కట్టబెట్టే వేళలో ప్రభుత్వం.. ప్రజాప్రయోజనాల్ని పరిగణలోకి తీసుకోవాలన్న ఘాటు వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చాలా వేగంగా జరుగుతున్నాయన్న కారణంతో అక్రమ కేటాయింపులు చట్టబద్ధమైపోవని.. నిర్మాణాలు జరు గుతున్నాయని అసలు గ్రౌండ్ కానే కాదంటూ వ్యాఖ్యలు చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలో సర్వే నెంబరు 41లో అత్యంత విలువైన15 ఎకరాల భూమిని హెటిరో డ్రగ్స్ ఛైర్మన్

మిగతా 2లో...

## కాంగ్రెస్ గూటికే
# జూపల్లి, పొంగులేటీ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**




కొద్దిరోజులుగా తెలంగాణ రాజకీయాల్లో చర్చగా మారారు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు. పొంగులేటిది ఉమ్మడి ఖమ్మం జిల్లా అయితే.. జూపల్లిది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా. ఈ ఇద్దరు నేతలు బీఆర్ఎస్ నుంచి వేటు వేశారు. అప్పటి నుంచి పొంగులేటి, జూపల్లి ఏ పార్టీలోకి వెళ్తారు..? వీళ్ల రాజకీయ ప్రయాణం

మిగతా 2లో...

## గెలుపే లక్ష్యంగా ..
# కాంగ్రెస్ కొత్త ఫార్ములా..!

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు**

తెలంగాణా కాంగ్రెస్‌కి అధికారంలోకి వస్తామన్న ధీమా అయితే పెరిగింది. అధినాయకత్వం సైతం ఈసారి తెలంగాణా మనదే అన్న నమ్మకంతో ఉంది. దాంతో పార్టీలో ఉన్న చిన్న పాటి సమస్యలను సరిదిద్దుకుంటే అంతా ఒక్కటిగా పనిచేస్తే పవర్ కాంగ్రెస్ చేతికి వస్తుంది అన్న అంచనాల్లో ఉంది. దాంతో తెలంగాణా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సీనియర్ల మధ్య ఒక చక్కని అవగాహన కుదిర్చే పనిలో హై కమాండ్ ఉందని అంటున్నారు. అంతా ఒకటిగా నిలిస్తే గెలుపు ఖాయమన్న భావనతో పార్టీ హై కమాండ్ తగిన రిపేర్లు చేస్తోంది అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఒక ఫార్ములాతో హై కమాండ్ ముందుకు వస్తోంది అని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ హై కమాండ్ ఫార్ములా కారణంగా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేతిలో అరవై సీట్లు ఉన్నట్లే అని అంటున్నారు. అలా పీసీసీ చీఫ్ యువకుడు డైనమిక్ లీడర్ అయిన రేవంత్ రెడ్డి కి హై కమాండ్ ఫ్రీ హ్యాండ్ దాదాపుగా ఇచ్చేసింది అని అంటున్నారు. ఇక మిగిలిన సీట్లలో సీనియర్లకు బాధ్యతలు అప్పచెబుతోంది అని అంటున్నారు. అది కూడా పక్కాగా సర్వేలలో అభ్యర్ధులు గెలుస్తారు అని తేలితేనే టికెట్ అన్న కండిషన్ పెట్టినట్లుగా చెబుతున్నారు. అది రేవంత్ రెడ్డికి కూడా వర్తిస్తుంది అని అంటున్నారు. అభ్యర్ధులు ఆశావహులు ఎవరి సిఫార్సుతో వచ్చినా పార్టీ చేయించిన

మిగతా 2లో...

# బండిపై పెరుగుతున్న అసమ్మతి ?

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు**



ఎన్నికలు దగ్గరకు వస్తున్న కొద్దీ బీజేపీ చీఫ్ బండి సంజయ్ పై అసమ్మతి పెరిగిపోతోంది. మామూలుగా ఎన్నికలు దగ్గరకు వస్తున్న నేపథ్యంలో విభేదాలను సర్దుబాటు చేసుకుని నేతలందరు ఏకతాటిపైన నడవాలని పార్టీల్లో ఆశిస్తారు. కానీ బీజేపీలో మాత్రం బండిపైన రోజురోజుకు వ్యతిరేకత పెరిగి పోతోంది. బండి వ్యవహారశైలికి వ్యతిరేకంగా గతంలో కూడా కొందరు నేతలు సమావేశమయ్యారు. తర్వాత మీడియాలో మాట్లాడారని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని నోటీసులు కూడా ఇచ్చారు. ఆ నోటీసులు ఏమయ్యాయో వాటికి ఏమి సమాధానం ఇచ్చారో ఎవరికీ తెలీదు. తాజాగా ఎంఎల్ఏ క్వార్టర్స్ లో మాజీ ఎంఎల్ఏ గుజ్జల రామ కృష్ణారెడ్డి చింతా సాంబమూర్తి సుగుణాకరరావు వెంకటరమణి డాక్టర్ మల్లారెడ్డి పాపారావు తదితరులు సమావేశమయ్యారు. బండి వ్యవహారశైలిపై మండిపోయారు. పార్టీ అధ్యక్షుడి వైఖరి ఏమాత్రం బాగా లేదని అధిష్టానంకు చెప్పినా ఎవరు ప ట్టించుకోలేదని అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఈనెలావరకు వెయిట్ చేస్తామని ఒకవేళ బండి వైఖరిలో ఎలాంటి మార్పురాకపోతే ఏదో ఒకటి తేల్చుకుంటామని హెచ్చరించారు. మొదట నుండి బండి ఏకపక్ష ధోరణితోనే వెళుతున్నారని సమావేశం అభి ప్రాయపడింది. పార్టీలోని కార్యవర్గంతో లేదా సీనియర్లతో ఎలాంటి సంప్రదింపులు సలహాలు లేకుండా బండి ఒక్కళ్ళే నిర్ణయాలు తీసుకుం టున్నట్లు మండి పడ్డారు. బండి వైఖరి వల్ల ఇప్పటికే పార్టీ చాలా నష్టపో యిందని నేతలు మండిపడ్డారు. పార్టీ నష్టపోతున్న తీరును రాష్ట్ర

మిగతా 2లో...

## హైదరాబాద్ ఐటీవీ
# 7లక్షల మందికి ఉపాధి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



హైదరాబాద్ కేంద్రంగా 2013-14లో ఐటీ ఉత్పత్తులు రూ.56 వేలు కోట్లుగా ఉంటే, అది నేడు రూ.1.83 లక్షల కోట్లకు చేరిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరం ఐటీ రంగంలో దూసుకుపోతోందని చెప్పారు. హైటెక్ సిటీలోని టీ హబ్‌లో మంత్రి కేటీఆర్ 9వ వార్షిక ఐటీ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఐటీ రంగంలో బెంగళూరుతో పోటీ పడేలా హైదరాబాద్‌ను నిలబెట్టామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఐటీ సెక్టార్‌లో 3.20 లక్షల ఉద్యోగాలు ఉంటే.. ఇప్పుడు 7 లక్షలకు పైచిలుకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి వచ్చామని చెప్పారు. ఐటీ రంగం దూసుకెళ్లేందుకు తమ టీమ్ బాగా పని చేస్తోందని కేటీఆర్ ప్రశంసించారు. ఐటీ రంగంలో కేంద్రం నుంచి సహకారం ఏమీ

మిగతా 2లో...

## గులాబీ ఫస్ట్ లిస్ట్ రెడీ..?

(మొదటిపేజీ తరువాయి)

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అసెంబ్లీ రద్దు, అభ్యర్థుల ప్రకటన ఒకే రోజు జరిగింది. ఈసారి కూడా అదే వ్యూహంతోనే పార్టీ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించనున్నట్టు తెలుస్తున్నది. సెప్టెంబరులో ఈసీ ఎన్నికల షెడ్యూలును ప్రకటించే చాన్స్ ఉంది. అంతలోపే అభ్యర్థుల ఎంపిక ఫైనల్ కావాలనే నిర్ణయానికి గులాబీ బాస్ వచ్చినట్టు ప్రగతి భవన్ వర్గాల సమాచారం.దశాబ్ది వేడుకలు ముగిసిన తర్వాత ఎమ్మెల్యేలతో ముఖాముఖి భేటీలు నిర్వహించి.. ఎవరికి టికెట్ వస్తుంది? ఎవరిని పక్కన పెడుతున్నాం అనే విషయంలో క్లారిటీ ఇవ్వనున్నట్టు సమాచారం. నిజానికి ఆరునెలల ముందుగానే టికెట్లు ప్రకటిస్తానని గతంలోనే కేసీఆర్ పలు సార్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగానే కసరత్తును ఆయన తీవ్రం చేశారు.వీలైనంత త్వరగా అభ్యర్థులను ప్రకటిస్తే టికెట్ దక్కని వారని బుజ్జగించేందుకు టైం ఉంటుందని భావిస్తున్నారు. చివరి నిమిషంలో టికెట్లు ప్రకటిస్తే, టికెట్ రాని సిట్టింగ్‌లు, టికెట్ ఆశించి భంగపడ్డ లీడర్లతో ఎలక్షన్ టైమ్‌లో పార్టీకి నష్టం చేకూరుతుందని ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది.అభ్యర్థులను ముందే ప్రకటిస్తే టికెట్ రాని వారిని బుజ్జగించవచ్చని, నచ్చని వారు ఇతర పార్టీలోకి వెళ్లినా ఫర్వాలేదనే నిర్ణయానికి గులాబీ బాస్ వచ్చినట్టు తెలుస్తున్నది. ఓ వైపు ప్రతిపక్ష పార్టీలతో ఫైటింగ్, మరోవైపు అసమ్మతి లీడర్లతో పేచీలు ఇబ్బందుల పాలు కావొద్దనే అభిప్రాయంతో సీఎం ఉన్నారని ప్రగతిభవన్‌కు సన్నిహితంగా ఉన్న ఓ లీడర్ కామెంట్ చేశారు.వివాదాలు లేని సెగ్మెంట్లలో ముందుగా అభ్యర్థులను ప్రకటించాలని సీఎం భావిస్తున్నారు. సిట్టింగులను పక్కన పెట్టే అవకాశం ఉన్న చోట్ల కొత్త అభ్యర్థులను ప్రకటించేందుకు మరికొంత సమయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రెండో దఫాలో కొత్త అభ్యర్థులను ప్రకటిస్తారని ప్రచారం జరుగుతున్నది. శ్రావణ మాసంలో ఇదంతా పూర్తయ్యే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది.

## తెలంగాణ కేసీఆర్ సర్కారుకు

# భారీ ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

పార్థసారథిరెడ్డికి చెందిన సాయిసింధు ట్రస్టుకు 60 ఏళ్లకు లీజుకు ఇస్తూ నిర్ణయం తీసుకన్నారు. దీనిపై డాక్టర్ ఊర్మిళ పింగ్లే.. కె.సురేశ్ కుమార్ హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్.. జస్టిస్ బి విజయ్ సేన్ రెడ్డిల ధర్మాసనం తాజాగా తీర్పును ఇచ్చింది. మరణించిన తన కుమార్తె పేరు మీద ట్రస్టు ఏర్పాటు చేసి సమాజానికి ఎంతోకొంత సేవ చేసేందుకు పార్థసారధి రెడ్డి ముందుకు వచ్చారని.. 500 పడకలతో ప్రపంచ స్థాయి వసతులతో క్యాన్సర్ హాస్పిటల్ నిర్మించాలని పేర్కొన్నారు. భూమి కొంటే ఎక్కువ ఖర్చు అవుతుందని.. హాస్పిటల్ నిర్మాణం కష్టంగా ఉంటుందన్న ఉద్దేశంతో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి మాదిరి భూమిని లీజుకు ఇవ్వాలనిప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు ఆసుపత్రిలో 25 శాతం పడకలు పేదలకు ఉచితంగా ఇవ్వటంతో పాటు.. 40 శాతం ఓపీ సర్వీసులు ఉచితంగా ఇస్తామని చెప్పారు.దీనికి ప్రతిగా వాదనలు వినిపిస్తూ.. "రూ.500 కోట్ల కంటే ఎక్కువ విలువైన భూమిని అతి తక్కువ ధరకు ఎలా లీజుకు ఇస్తారు? కనీసం రూ.50కోట్ల లీజు మొత్తం తీసుకోవాల్సి ఉంది. ప్రతి ఐదోళ్లకు ఒకసారి మార్కెట్ ధర ప్రకారం ధరలు సవరించాలి. కానీ.. విలువైన భూమిని ఏడాదికి రూ.1.47 లక్షలకు మాత్రమే జీవోజారీ చేశారు. ట్రస్టు ఛైర్మన్ కు గతంలో ఆసుపత్రిని నడిపిన అనుభవం లేదు.డాక్టర్ కూడా కాదు. ట్రస్టు2014లో ఏర్పాటు చేస్తే 2018లో జీవో ఇచ్చారు. సేవ చేయాలంటే గ్రామీణప్రాంతాల్లో ఆసుపత్రి పెట్టాలి. విలువైన భూముల్లో ఎందుకు? గతంలో జారీ చేసిన జీవోలకు విరుద్ధంగా కేటాయింపులు ఉన్నాయి" అని పేర్కొన్నారు.ఇరు వర్గాల వాదనలు విన్నధర్మాసనం తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. "భూమి మార్కెట్ విలువలో 10 శాతం విలువను వసూలు చేయాలి. ఈ లీజు మొత్తాన్ని ప్రతి ఐదేళ్లకు ఒకసారి రివ్యూ చేయాలి. సాయి సింధు ఫౌండేషన్ కు పది ఎకరాలు ఇవ్వాలని కలెక్టర్ సిఫార్సు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించింది. ప్రభుత్వం తన విచక్షణ లేకుండా అడిగినంత భూమిని కేటాయించింది. ప్రతివాది అడిగినట్లుఅలైన్ మెంట్లను సైతం మార్చింది. 1989లో బసవతారకం ఆసుపత్రికి లీజుకు ఇచ్చే వేళలో భూకేటాయింపు పాలసీ లేదు. హైదరాబాద్ నగరంలో 1989 నాటి భూముల ధరలకు.. 2018 నాటి భూముల ధరలకు అసలు పోలికే లేదు. ఈ విషయాన్ని పట్టించుకోకుండా బసవతారకం ఆసుపత్రికి 30 ఏళ్ల క్రితం ఇచ్చిన లీజు రేటుకు కేటాయించారు. బుర్రను ఉపయోగించకుండా కేటాయింపుల జీవోను జారీ చేశారు. ప్రభుత్వ ఆస్తుల్ని కట్టబెట్టే వేళలో ప్రజా ప్రయోజనాల్ని పరిగణలోకి తీసుకోవాలి. అందుకే ఈ జీవోను కొట్టేస్తున్నాం' అని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ గూటికే జూపల్లి, పొంగులేటి

(మొదటిపేజీ తరువాయి)

ఏంటి అని విస్తృత చర్చ జరుగుతోంది. ఈ చర్చకు ఎట్టకేలకు ముగింపు పలికే అంశం తెరపైకి వచ్చింది. ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు. వీరి చేరికకు కాంగ్రెస్‌లో లైన్ క్లియర్ అయ్యిందనే చర్చ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ కనిపిస్తోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత ఆ పార్టీపై పాజిటివ్ ధోరణితో నేతలు ఉన్నట్టు అర్థమవుతోంది. తమతోపాటు తమ అనుచరలకు టికెట్లు కేటాయిస్తే చేరేందుకు సిద్ధమని కాంగ్రెస్ అధిష్ఠానంతో చాలా రోజులుగా ఈ ఇద్దరి నేతలు చర్చలు జరుపుతున్నారు. ఈ విషయంపై సుదీర్ఘ మంతనాలు జరిపిన కాంగ్రెస్ అధినాయకత్వం ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ మూడో వారంలో కానీ నెలాఖరుకు కానీ జూపల్లి, పొంగులేటి చేరికలు ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అమెరికా టూర్‌లో ఉన్నారు. ఆయన వచ్చిన తర్వాత ఓ డేట్ ఫిక్స్ చేసుకుంటారు. ఆ తర్వాత ఖమ్మంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి .. ఎవరు పార్టీలోకి వస్తామన్నా తీసుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఆయన ప్రెస్ మీట్లలో నేరుగా పేర్లు పెట్టి మరీ పిలుస్తున్నారు. అయితే పార్టీలో చేర్చుకోవడం వరకూ ఓకే కానీ వారికి టిక్కెట్లు కేటాయించే అంశంలో రేవంత్ రెడ్డి హామీ ఇవ్వలేకపోతున్నారు. టిక్కెట్ల కేటాయింపు ఆయన చేతుల్లో ఉండదు. అందుకే ఆయన పిలుపులకు స్పందించేవారు.. తెర వెనుక చర్చలు జరుపుతున్నారు. టిక్కెట్ల కేటాయింపు విషయంలో హామీ ఇస్తే.. పార్టీ కండువా కప్పుకుంటామని మంతనాలు జరుపుతున్నారు. దీనిపై హామీ దొరికిన వెంటనే పార్టీలో చేరేందుకు ఓకే చెబుతున్నారు. ఇప్పుడు పొంగులేటి, జూపల్లి విషయంలో అదే జరిగిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నారు. కచ్చితంగా అభ్యర్థిత్వం ఇవ్వాల్సిందే అనుకున్న నేతలు వస్తామంటే కాంగ్రెస్ పార్టీ కూడా పెద్దగా ఆలోచించదని ఈ ఎపిసోడ్‌తో అర్థమైంది. ఎంపీ టిక్కెట్ మీద పోటీ చేయాలంటే ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ పార్టీని బలోపేతం చేసే అవకాశం ఉండాలని షరతు పెడుతున్నారు. అలాంటి నేతలకుట టిక్కెట్లు ఇచ్చేందుకు రెడీగానే ఉన్నామంటూ హామీ ఇస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఇటీవల నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. చాలా మందితో చర్చలు జరు పుతున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ కు గురైన జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత పార్టీ ఆలోచన చేశారు. ఎన్నికలకు సమయం దగ్గర పడినందున అలాంటి ప్రయత్నం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న అంచనాలతో ప్లాన్ మార్చారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మొగ్గు చూపారు. అటు బీజేపీ కూడా వీళ్లిద్దర్నీ చేర్చుకునేందుకు ప్రయత్నించి విఫలమైంది. ఆపార్టీ చేరికల కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ రంగంలోకి వీళ్లతో మంతనాలు జరిపారు. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయని... అనుకున్నంత బలంగా బీజేపీ లేదన్న కారణాలతో వాళ్లు ఈటల ఆఫర్‌ను తిరస్కరించారు. ఈ సందర్భంగా ఈటల చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. లీడర్లు పార్టీలోకి రావాలని తాను ఆహ్వానిస్తుంటే... వాళ్లే తనకు బ్రెయిన్ వాష్ చేస్తున్నారని చెప్పడం సంచలనంగా మారింది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులను చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ నేతలు కూడా ప్రయత్నించారు. బీజేపీ చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఈటల రాజేందర్ వీరితో చర్చించారు కూడా. కానీ.. ఇద్దరు నేతలు తనకు రివర్స్ కౌన్సిలింగ్ ఇస్తున్నారని ఆ మధ్య ఈటల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇన్నాళ్లూ వాళ్లు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా ఆపగలిగాను తప్ప వారి మనసు మార్చలేకపోయానన్నది ఈటల కామెంట్.బీజేపీ నేతల కంటే ముందుగానే కాంగ్రెస్ పార్టీ అప్రమత్తం అయ్యింది. పొంగులేటి, జూపల్లితో రాహుల్ గాంధీ టీమ్ రహస్యంగా సమావేశమై చర్చించింది. తెలంగాణ కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నేతలూ తమ వంతు ప్రయత్నం చేశారు.

పొంగులేటి, జూపల్లి చేరడమే కాకుండా తమ అనుచరులకు కూడా టికెట్స్ ఇవ్వా లన్నది మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నారు. ఈ షరతులకు రాహుల్ గాంధీ టీమ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు తెలుస్తోంది. పొంగులేటి, జూపల్లి ఇద్దరికీ టికెట్స్ ఇవ్వడంతోపాటు.. వాళ్ల అనుచరులకు టికెట్ల విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నట్టు సమాచారం.

# తెలంగాణాలో బీజేపీ పనైపోయిందా..!

(మొదటిపేజీ తరువాయి)

రావడమే అన్నంతగా ప్రచారం సాగింది.అయితే దుబ్బాకలో లోకల్ లీడర్ రఘునందనరావు బలంగా ఉన్నారు. హుజూరాబాద్ లో మాజీ మంత్రి ఈటెల రాజేందర్ బలం బలగానికి తోడు ఆయన పొలిటికల్ ఇమేజ్ కొండంత అండగా మారి బీజేపీకి విజయాన్ని నమోదు చేశాయి. ఇలా ఇతర పార్టీల నుంచి గట్టి నాయకులు జంప్ చేయడం వల్లనే బీజేపీకి విజయం దక్కింది అన్నది అసలైన విశ్లేషణ.అయితే ఈ మధ్యన చూస్తే బీజేపీ తెలంగాణాలో బాగా వీక్ అయింది అని అంటున్నారు. అది కూడా ఎవరో చెప్పింది కాదు బీజేపీ నేత ఈటెల రాజేందర్ స్వయంగా చేసిన సర్వేలో తేలింది అని అంటున్నారు. ఈటెల రాజేందర్ ఎప్పటికపుడు సర్వేలు పార్టీ పరిస్థితి మీద చేయిస్తున్నారు అని అంటున్నారు.తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ గా ఉన్న బండి సంజయ్ వల్ల పార్టీకి ఈసారి ఓట్లు రావు అని కూడా ఈటెల సర్వేలో వెల్లడి అయిందట. ఎమోషన్ అన్నది ప్రతీ ఎన్నికల్లోనూ పనిచేయదని అందువల్ల బండి సంజయ్ ఆవేశపూరిత రాజకీయం తెలంగాణాలో కమలం పార్టీకి ఈసారి ఓట్లు రాల్చదని అంటున్నారు.ఇక కేంద్రంలో తొమ్మిదేళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణా రాష్ట్రం కోసం ప్రత్యేకంగా ఏమీ చేయేలేదన్నది జనంలో ఉన్న అతి పెద్ద ఫిర్యాదుగా ఉంది అంటున్నారు. ఆ విధంగా బీజేపీ అంటే ప్రజలు వ్యతిరేకత తెలియచేస్తున్నారు అని అంటున్నారు. ఇక టీయారెస్ బీయారెస్ అయిన తరువాత తెలంగాణాలో బీయారెస్ బాగా వీక్ అయిందని ఈ సర్వేలో తేలింది అని అంటున్నారు.టీయారెస్ వెనక కొండంత అండగా తెలంగాణా అస్థిత్వం ఉదని దానిని కాదనుకుని భారత దేశం అంతటా పార్టీ అనుకుంటూ బీయారెస్ గా పేరు మార్చుకుని సెంటిమెంట్ ని పూర్తిగా కోల్పోయిందని అంటున్నారు. బీయారెస్ అని జాతీయ పార్టీ అని ఆర్భాటం ఎంత చేసుకున్నా దాని ఓటు బ్యాంక్ అంతా తెలంగాణాలోనే ఉంది. జాతీయ పార్టీ అని ఒక వైపు చెప్పుకుంటూ తెలంగాణా సెంటిమెంట్ ని ఎత్తుకోలేక బీయారెస్ నానా అవస్థలు పడుతోంది అని అంటున్నారు. బీయారెస్ ఒక వైపు ఇబ్బంది పడుతూంటే బీజేపీ గ్రాఫ్ తగ్గిన నేపథ్యం మరో వైపు ఉంది. మరో కీలకమైన పార్టీగా కాంగ్రెస్ ని చూస్తూంటే పక్కనే ఉన్న కర్నాటకలో గెలిచి మంచి హుషారు మీద కాంగ్రెస్ పార్టీ ఉంది. ఈ నేపథ్యంలో ప్రజల ఆలోచనలు కూడా ఆ వైపుగా మారుతున్నాయని సర్వేలలో తేలుతున్న విషయంగా ఉంది.ఇక బీయారెస్ నుంచి బయటకు వచ్చి బీజేపీలోకి చేరాలనుకుంటున కొందరు బిగ్ షాట్స్ కి కూడా కాంగ్రెస్ వైపు గానే ఆలోచనలు మళ్ళుతున్నాయని అంటున్నారు. మంచి ఊపు మీద ఉన్న కాంగ్రెస్ కే మద్దతు ఇస్తే కర్నాటకలో గెలిచినట్లుగా తెలంగాణాలో గెలుస్తుంది అని ఆలోచించే సీనియర్ లీడర్లలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీ మంత్రి జూపల్లి క్రిష్ణారావు వంటి వారు ఉన్నట్లుగా తెలుస్తోంది అంటున్నారు.పొంగులేటి టీం ని బీజేపీలోకి రప్పించేందుకు ఈటెల రాజేందర్ కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి టీం తెగ ప్రయత్నాలు చేసింది. అయితే వారికి ఇపుడు అర్థమవుతోంది ఏంటంటే బీజేపీలోకి ఇక చేరికలు ఉండవని పొంగులేటి టీం ఆలోచనలలో వచ్చిన మార్పు వల్ల వారంతా కాంగ్రెస్ వైపే వెళ్తారని అని అంటున్నారు.ఇక పొంగులేటి టీం అంతా కలసి తొందరలో ప్రియాంకా గాంధీ సమక్షంలో కాంగ్రెస్ లో చేరిపోతారని బీజేపీ నేతలే ఊహిస్తున్నారు అంటేనే తెలంగాణాలో కమలం సీన్ ఎలా ఉందో అర్థమవుతోంది అని అంటున్నారు. ఇక పొంగులేటి టీం కి కావాల్సిన సీట్లు ఫైనల్ చేసే దిశగా కాంగ్రెస్ ఉందని సో బిగ్ షాట్స్ అంతా ఇక చేరేది కాంగ్రెస్ లోనే అని ఈటెల బృందానికి బాగా అర్థం అయింది అని అంటున్నారు.చేరిక కమిటీ కన్వీనర్ గా ఉన్న ఈటెలకు ఇపుడు తెలంగాణాలో బీజేపీ పరిస్థితి అక్కడ నాయకుల ఆలోచనలు బాగా అర్థమవుతున్నాయని అంటున్నారు. ఇక బీయారెస్ నుంచి బయటకు వచ్చిన వారే కారు రానున్న రోజుల్లో అధికార బీయారెస్ నుంచి చాలా మంది పెద్ద నాయకులతో పాటు తటస్థంగా ఉన్న నేతలంగా కాంగ్రెస్ లోనే చేరేందుకు రెడీ అవుతున్నారని అంటున్నారు. బీజేపీలో చేరికలు ఇపుడు సడెన్ గా ఆగిపోయాయి. ఇదే సంతోషం అనుకోవాలేమో. లేకపోతే మునుముందు బీజేపీలోకి వచ్చిన వారు కూడా కాంగ్రెస్ బాట పట్టే ప్రమాదం పొంచి ఉందా అన్న డౌట్లు కూడా బీజేపీ పెద్దలలో కలుగుతునాయట. ఏది ఏమైనా కర్నాటక ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణా రాజకీయాలు పూర్తిగా మారిపోయాయని అంటున్నారు.

## బండిపై పెరుగుతున్న అసమ్మతి ?

(మొదటిపేజీ తరువాయి)

ఇన్చార్జీలకు ఎన్నిసార్లు చెప్పినా ఉపయోగం లేకపోయిందన్నారు. తన సొంత ప్రచారం ఆధిపత్యం కోసమే మొదటినుండి బండి పాకులాడుతున్నట్లు అసమ్మతినేతలు ఆరోపించారు.పార్టీలోని సీనియర్లకు కనీస గౌరవం కూడా ఇవ్వటంలేదన్నారు. జిల్లాల పర్యటనలకు వచ్చినపుడు కూడా అందరికీ సమాచారం ఇవ్వటం లేదన్నారు. బండిలో మార్పువస్తుందనే ఇంతకాలం వెయిట్ చేసినట్లు చెప్పారు. తాము ఆశించినట్లు మార్పురాకపోతే ఏమి చేయాలనే విషయాన్ని అప్పుడు సమావేశమై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కారణం స్పష్టంగా తెలీదుకానీ ఢిల్లీలోని పెద్దల నుండి అర్జంటుగా రమ్మని బండికి పిలుపొచ్చింది. అమిత్ షా–చంద్రబాబునాయుడు భేటీ తర్వాతే బండికి పిలుపురావటం గమనార్హం. పొత్తుల విషయంలో మాట్లాడేందుకేనా లేకపోతే అసమ్మతినేతల ఫిర్యాదు కారణంగా పిలిపించారా అన్నది తెలీదు.

## హైదరాబాద్ ఐటీవీ

# 7లక్షల మందికి ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

లేదని విమర్శించారు. మాట సాయం తప్ప కేంద్రం ఎలాంటి అండదండలు అందించలేదని అన్నారు. యూపీఏ ప్రభుత్వం తెలంగాణకు కేటాయిచిన ఐటీఐఆర్‌ను కూడా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. అయినా నిలదొక్కుకుని ఐటీ రంగాన్ని అగ్రభాగాన నిలబెట్టామని కేటీఆర్ తెలిపారునల్లగొండ, సిద్దిపేట, సిరిసిల్ల, వరంగల్, మహబూబ్‌నగర్ లాంటి పట్టణాలకు కొత్త ఐటీ సంస్థలు వస్తున్నాయని కేటీఆర్ చెప్పారు. "వరంగల్‌కు టెక్ మహీంద్రా, జెన్ ప్యాక్ లాంటి సంస్థలు వస్తున్నాయి. మహబూబ్‌నగర్‌లోనూ కొన్ని సంస్థలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. నల్లగొండ వంటి టైర్ 2 పట్టణాలకు పరిశ్రమలు వస్తున్నాయి. ఫాక్స్‌కాన్ సంస్థ లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. త్వరలోనే ఈ మొబిలిటీ వీక్ నిర్వహించబోతున్నాం. టీ వర్క్స్ సంస్థకు ఇటీవలే కేంద్రం అవార్డు ఇచ్చింది. టీ వర్క్స్ స్ఫూర్తితో మహారాష్ట్ర ఎం వర్క్స్ ఏర్పాటు చేయబోతుంది అని కేటీఆర్ తెలిపారు.హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు జర్మనీ కంపెనీ బాష్ ముందుకొచ్చిందని కేటీఆర్ చెప్పారు. "మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ హైదరాబాద్‌కు వస్తోంది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ సెంటర్ ఈ ఏడాది వస్తుంది. మరో రెండేళ్లలో డజోన్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తోంది. అమెరికాకు చెందిన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ హైదరాబాద్‌లో డెవలప్ సెంటర్ నిర్మిస్తోంది. అమెరికాకు చెందిన జాప్‌కామ్ సెంటర్ కూడా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతోంది. టెక్నిప్ ఎఫ్ఎంసీ కంపెనీ సెంటర్ కూడా వస్తోంది" అని కేటీఆర్ అన్నారు. "ఈ మధ్య అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లో అనేక మంది పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యాను. బెల్లంపల్లిలో పెట్టుబడులు పెట్టేందుకు రెండు వాషింగ్టన్ కు చెందిన కంపెనీలు ఆసక్తి చూపాయి. అనేక అమెరికా కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. అమెరికాకు చెందిన క్వాల్‌కామ్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతోంది.

## గెలుపే లక్ష్యంగా ..

# కాంగ్రెస్ కొత్త ఫార్ములా..!

(మొదటిపేజీ తరువాయి)

సర్వేలలో గెలుపు అవకాశాలు లేకపోతే మాత్రం టికెట్ ఇచ్చేది ఉండదని అంటున్నారు.అంతే కాదు కర్నాటకలో కాంగ్రెస్ ని బంపర్ మెజారిటీతో గెలిపించిన సునీల్ కనుగోలు తెలంగాణా కాంగ్రెస్ గెలుపు కోసం సర్వ శక్తులూ ఒడ్డుతున్నారు. ఆయనే వ్యూహాలు అన్నీ రచిస్తున్నారు. ఆయన మాట మీదనే ముందుకు సాగాలని కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయించుకుందని అంటున్నారు. అంటే సునీల్ కనుగోలు మాటే శిలా శాసనం వేదమని కాంగ్రెస్ అధినాకత్వం భావిస్తోంది అన్న మాట.మొత్తం మీద చూసుకుంటే గతంలోలా గుడ్డిగా కాంగ్రెస్ ఎవరికి పడితే వారికి టికెట్ ఇవ్వదు అని అర్థం అవుతోంది. పీసీసీ చీఫ్ చెప్పినా లేక సీనియర్ల మద్దతు ఉన్నా కూడా ఆ క్యాండిడేట్ గెలుపు గుర్రం అయి ఉండాలి. అపుడే అతనికి టికెట్ ఇస్తారు.ఈసారి పక్కాగా ప్లాన్ వేసుకుని మరీ కాంగ్రెస్ తెలంగాణా బరిలోకి దూకుతోంది.ఆరు నూరు అయినా గెలిచి తీరాలన్నదే కాంగ్రెస్ ఆలోచనగా ఉంది. దాంతోనే మొహమాటాలకు పోరాదని భావిస్తోంది. అదేనిజం అయితే మాత్రం అయిదేళ్ళూ హాయిగా ఇంట్లో గడిపి చివరాఖరు నిముషంలో ఎవరో ఒకరిని పట్టుకుని టికెట్ సంపాదించుకుని లక్ ఉంటే గెలిచేద్దామనుకునే బాపతుకు ఈసారి అసలు చాన్స్ లేదని కాంగ్రెస్ పెద్దలు గట్టిగానే చెబుతున్నారు.దీంతో అందరూ గ్రౌండ్ లోకి వచ్చి పనిచేయాలి. జనంలో పేరు తెచ్చుకోవాలి. గెలుస్తారు అన్న నమ్మకం ఉంటే కచ్చితంగా హై కమాండ్ టికెట్ ఇస్తుంది. సో ఇదన్న మాట మ్యాటర్. మొత్తానికి గెలవడానికి అవసరం అయిన అన్ని వ్యూహాలను కాంగ్రెస్ రెడీ చేసుకుంది అని అంటున్నారు. దాని మీద అంతా ఐక్యంగా ముందుకు అడుగులు వేస్తే మాత్రం తెలంగాణాలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమనే అంటున్నారు.

## సంపాదకీయం

# గాలిలో దీపంలా రైళ్ల భద్రత

భారత రైల్వే ప్రయాణీకుల భద్రతను గాలిలో దీపంగా మార్చేసిందనడానికి ఒడిశాలోని బాలాసూర్ వద్ద జరిగిన ఘోర ప్రమాద సంఘటన నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో చోటు చేసుకున్న మూడు రైళ్ల ఢీ ఘటన భారతీయ రైల్వేల భద్రతపై మరోసారి సందేహాల్ని రేకెత్తించింది. అంతే కాదు ఘటన జరిగిన ఒడిశా.. రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వరాష్ట్రం కూడా కావడంతో ఆయన కూడా ఇరుకునపడ్డారు. ఇన్నాళ్లు కవచ్ పరిజ్ఞానం దేశమంతా వాడేస్తున్నామంటూ ఇక రైల్వే ప్రమాదాలే జరగవన్న రీతిలో ఊదరగొట్టిన కేంద్రానికి ఈ ఘటనను ఎలా సమర్థించుకోవాలో తెలియడం లేదు. ఒడిశాలోని బహనాగ్ వద్ద జరిగిన కోరమాండల్, హౌరా-బెంగళూరు, గూడ్స్ రైళ్ల ఢీ ఘటన రైల్వేల్లో భద్రతా లోపాల్ని మరోసారి ఎత్తిచూపింది. ముఖ్యంగా కరోనా తర్వాత చోటు చేసుకున్న మార్పులతో వందే భారత్ రైళ్లను నడుపుతున్న రైల్వే ఈ ఘటనతో ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయింది. ఇలాంటి ట్రాక్ లు, సిగ్నలింగ్ సిస్టమ్ లను ఉంచుకుని వందే భారత్ రైళ్లను నడిపితే ఊహకందని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తేలిపోయింది.వందల మంది మృత్యువాత పడిన ఆ సంఘటనకు సంబంధించి సహాయక చర్యలు ఒక వైపు సాగుతుండగానే అదే ఒడిశాలో ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఒడిశాలోని బర్గఢ్ జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. సున్నపు రాయి లోడుతో వెళుతున్న ఈ రైలు సంబర్‌ధార వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం సంభవించకపోయినపపటికీ రైల్వే శాఖ నిర్లక్ష్యం పెను ప్రమాదం తరువాత కూడా ఇసుమంతైనా తగ్గకుండా కొనసాగుతోందనడానికి నిదర్శనంగా ఈ ఘటన నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో కూడా నిన్న రాత్రి మచిలీపట్నం, తిరుపతి ఎక్స్ ప్రెస్ రైళ్లో మంటలు చెలరేగాయి. ప్రయాణీకుల అప్రమత్తతతో పెను ముప్పు తప్పింది. ఈ ఘటన గుంటూరు స్టేషన్ కు సమీపంలో జరిగింది. చక్రాల రాపిడి కారణంగా మంటలు చెలరేగాయని రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు లూబ్రికెంట్లు అయిపోవడమే కారణమంటున్నారు. ప్రయాణీకులు అప్రమత్తమై వెంటనే చైను లాగి రైలును ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దాదాపు రెండు గంటల తరువాత రైలు అక్కడ నుంచి తిరుపతికి బయలుదేరింది. వరుస ప్రమాదాలతో రైలు ప్రయాణమంటేనే జనం భయపడే పరిస్థితి తలెత్తింది. ఒక బాలాసూర్ వద్ద మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదానికి సిగ్నల్ సెట్టింగ్ లను ఎవరో మార్చివేయడమే కారణమని స్వయంగా రైల్వే మంత్రి చెప్పడంతో అసలు రైళ్లలో ప్రయాణం ఏ మాత్రం సేఫ్ కాదని పలువురు విమర్శిస్తున్నారు. కవచ్ రక్షణ ఉన్నా ఆ ప్రమాదాన్ని నిలువరించే పరిస్థితి లేదన్న రైల్వే మంత్రి ప్రకటన ప్రజలలో ఆందోళనను మరింతగా పెంచుతోంది. ఎవరిష్టం వచ్చినట్లు వారు సెట్టింగ్ లను మార్చేస్తే ఇక రైల్వే శాఖ భద్రతకు ఏం పూచిపడగలుగుతుందని ప్రశ్నిస్తున్నారు. సమగ్ర దర్యాప్తు, దర్యాప్తునకు ఉన్నత స్థాయి కమిటీ వంటి ఊకదంపుడు ప్రకటనలతో సరిపుచ్చడం కాకుండా.. కోరమాండల్ ఎక్స్ ప్రెస్ ప్రమాద ఘటనకు కారణమైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అన్నిటికీ మించి రైల్వే శాఖలో నిర్లక్ష్యం ఏ మేరకు పేరుకుపోయిందనడానికి రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాల గురించి ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు మూడు నెలల కిందటే హెచ్చరించినా.. ఆ లోపాల సవరణ దిశగా ఏ చర్యా తీసుకోకపోవడమే నిదర్శనం. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్‌లో మార్పు కారణంగానే కోరమాండల్ ఎక్స్ ప్రెస్ ప్రమాదం జరిగిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రాథమికంగా వెల్లడించిన నేపథ్యంలో- ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ వైఫల్యాన్ని ఆ ఉన్నతాధికారి గతంలోనే ఎత్తిచూపిన విషయం చర్చనీయాంశంగా మారింది. నైరుతి రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ తన ఉన్నతాధికారులకు ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఓ లేఖ రాశారు. ఫిబ్రవరి 8న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. నాడు వాస్తవానికి అప్ మెయిన్ లైన్‌లో వెళ్లేందుకు ఆ రైలుకు తొలుత అనుమతి లభించింది. కానీ కొద్దిదూరం వెళ్లాక డౌన్ మెయిన్ లైన్‌లో వెళ్లేలా ఇంటర్‌లాకింగ్ ఉండటం కనిపించింది. దాన్ని గుర్తించిన లోకో పైలట్ అప్రమత్త మయ్యారు.రైలును వెంటనే నిలిపివేశారు. ఇంటర్‌లాకింగ్ ఉన్న ప్రకారం వెళ్లి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేదే. సిగ్నలింగ్ వ్యవస్థలో తీవ్ర లోపాలు ఉన్నాయని ఈ ఉదంతం స్పష్టం చేస్తోందన్నది ఆ లేఖ సారాంశం. కొన్నిసార్లు సిగ్నల్ ప్రకారం రైలు ప్రారంభమయ్యాక.. అది వెళ్లాల్సిన ట్రాక్ మారిపోతోందని పేర్కొన్నారు. ఈ వైఫల్యాలను నివారిం చేలా తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకతను ఆయనా లేఖ లో స్పష్టంగా పేర్కొన్నారు.న అలా చేయని పక్షంలో ఘోర ప్రమా దాలు జరిగే ముప్పుందని లేఖలో హెచ్చరించారు. అయినా రైల్వే శాఖ ఆ హెచ్చ రికను పట్టించుకోలేదు. ఫలితమే కోరమాండల్ ఎక్స్ ప్రెస్ ఘోర ప్రమాదం.

## జలాంతర్గామి విధ్వంసక క్షిపణి పరీక్షలు విజయవంతం

### చెప్పుకోదగ్గ మైలురాయిని దాటిన భారత నావికా దళం

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు :** భారత నావికా దళం మంగళవారం చెప్పుకోదగ్గ మైలురాయిని దాటింది. మన దేశంలోనే తయారైన హెవీ వెయిట్ టార్పెడో (జలాంతర్గామి విధ్వంసక క్షిపణి) పరీక్షలు విజయవంతమయ్యాయి. సముద్రంలోపలి ప్రాంతంలో ఉన్న లక్ష్యాన్ని ఈ టార్పెడో విజయవంతంగా ధ్వంసం చేసింది. స్వయం సమృద్ధ భారత్ లక్ష్య సాధనలో ఇది గొప్ప ముందడుగు అని నావికా దళం వెల్లడించింది.భారత నావికా దళం మంగళవారం ఇచ్చిన ట్వీట్‌లో, మన దేశంలో అభివృద్ధిపరచిన హెవీవెయిట్ టార్పెడో సముద్ర గర్భంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు తెలిపింది. సముద్ర గర్భంలోని లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించే ఆయుధం కోసం జరుగుతున్న అన్వేషణలో భారత నావికా దళం, డీఆర్‌డీవో (రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ)లకు ఇది చెప్పుకోదగ్గ మైలురాయి అని పేర్కొంది.భారత నావికా దళం ఇచ్చిన ఈ ట్వీట్‌లో ఎనిమిది సెకండ్ల వీడియో క్లిప్ కూడా ఉంది. పొడవైన రంగురంగుల వస్తువు సముద్ర ఉపరితలంపై ఉన్నట్లు ఈ వీడియోలో కనిపించింది. ఆ వస్తువు అకస్మాత్తుగా పేలిపోవడం కనిపించింది.ఇదిలావుండగా, భారత నావికా దళం మే 31న మరో రికార్డు సృష్టించింది. మన దేశంలోనే డిజైన్ చేసి, నిర్మించిన విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పైకి ఎంహెచ్60ఆర్ హెలికాప్టర్ దిగింది.

# రేపే చేప ప్రసాదం పంపిణీ



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** చేప ప్రసాదం ఏ 171 ఏళ్లు.. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు బత్తిని కుటుంబ సభ్యులు అంతా సిద్ధం చేశారు. ఈ నెల 8న సాయంత్రం 6 గంటల నుంచి 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతుందని బత్తిని హరినాథ్ గౌడ్ తెలిపారు. చేప ప్రసాదం తయారీలో భాగంగా ఈ నెల 7న ఉదయం 11 గంటలకు దూద్‌బౌలిలోని ఆయన స్వగృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం 8వ తేదీ సాయంత్రం దూద్‌బౌలిలోని స్వగృహంలో కుటుంబ సభ్యులంతా చేప ప్రసాదాన్ని తీసుకున్న అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పంపిణీ ప్రారంభమవుతుంది. కాగా.. చేప ప్రసాదానికి 171 ఏళ్ల చరిత్ర ఉందని బత్తిని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రతి ఏడాది పాతబస్తీ దూద్‌బౌలిలోని తమ స్వగహంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చేప ప్రసాదాన్ని తయారు చేస్తారు.ఇంటి బావిలోని నీటితోనే ఈ చేప ప్రసాదాన్ని తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. పూర్వీకుల నుంచి ఈ బావిలోని నీటినే వాడుతున్నారు. ఇప్పటికీ ఈ బావిలో నీరు సమృద్ధిగా ఉంది.మొదట్లో 50 కిలోల వరకు తయారు చేసిన చేప ప్రసాదం ప్రస్తుతం 3.5 క్వింటాళ్లకు చేరిందని బత్తిని కుటుంబ సభ్యులు తెలిపారు. మొన్నటి వరకు చేప మందుగా ప్రాచుర్యం పొందగా.. ప్రస్తుతం చేప ప్రసాదంగా మారింది. భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ సైతం చేప ప్రసాదం కోసం ఇక్కడికి వచ్చారని బత్తిని కుటుంబ సభ్యులు చెబుతున్నారు?మూడు రకాలు?చేప మందును మూడు రకాలుగా తయారు చేస్తారు. చేపతో ఇచ్చే మందు, బెల్లంతో ఇచ్చే మందు, కార్తె మందు. 2 నుంచి 3 అంగుళాల కొరమీను చేపతో ఇచ్చే ప్రసాదాలు 10 గ్రాములుంటుంది. 30 గ్రాములు కలిగిన కార్తె మందును మూడు డోసులుగా 45 రోజుల పాటు వాడాలి. 15, 30,45 రోజుల్లో కార్తె మందును వాడాలి. చేపతో మింగడం ఇష్టం లేని వారికి బెల్లం ప్రసాదాన్ని అందజేస్తారు. నిజానికి చేపతో తీసుకునే ప్రసాదమే సత్ఫలితాలిస్తుందని చెబుతున్నారు.రెండు గంటలకు ముందుగా.. చేప ప్రసాదం స్వీకరించే ముందు రెండు గంటల వరకు ఎలాంటి ఆహార పదార్థాలతో పాటు నీటిని కూడా స్వీకరించరాదని బత్తిని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చేప ప్రసాదం స్వీకరించిన అనంతరం గంటన్నర వరకు కూడా ఆహారం, నీరు తీసుకోవద్దు.బత్తిని వీరన్న గౌడ్‌తో ప్రారంభం.. బత్తిని వంశ పూర్వీకులైన వీరన్న గౌడ్, శివరాంగౌడ్‌ల నుంచి చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతోంది. వీరి మూడో తరమైన శంకరయ్య గౌడ్ హయాంలో చేప ప్రసాదం పంపిణీ ఎక్కువ ప్రాచుర్యం పొందింది. అనంతరం మూడు తరాలుగా చేప ప్రసాదం కొనసాగుతూనే ఉంది?ఔషధ గుణాలు కలిగిన ప్రసాదాన్ని చేప నోటిలో పెట్టి మింగడంతో అది కదులుతూ గొంతు ద్వారా జీర్ణాశయంలోకి వెళ్లి జీర్ణకోశాన్ని శుభ్రం చేస్తుందంటున్నారు. అంతేకాకుండా నేరుగా జీర్ణాశయంలో జీర్ణం అవుతుండడంతో చేప ప్రసాదం త్వరగా రక్త ప్రసరణలో కలిసి శ్వాసకోశ సంబంధ వ్యాధులను తగ్గిస్తుందంటున్నారు బత్తిని సోదరులు.అప్పట్లో అక్కడ.. ఇప్పుడు ఇక్కడ.. పూర్వీకుల నుంచి 1996 వరకు పాతబస్తీ దూద్‌బౌలిలో పంపిణీ అయిన చేప ప్రసాదం.. 1997లో పాతబస్తీలో జరిగిన మతకలహాల కారణంగా నిజాం కాలేజీ గ్రౌండ్‌కు మారింది. 1998లో అప్పటి ప్రభుత్వం పంపిణీ కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను కేటాయించింది. అనంతరం చేప ప్రసాదం పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2012లో బత్తిని మృగశిర ట్రస్ట్‌కు కేటాయించిన కాటేదాన్‌లోని ఖాళీ స్థలంలో కాకుండా పక్కనే ఉన్న మరో ఖాళీ స్థలంలో పంపిణీ జరిగింది. పంపిణీ సందర్భంగా జరిగిన తొక్కిసలా టలో ఒకరు మృతి చెందడంతో పాటు పలువురు తీవ్ర గాయాలకు గురయ్యారు. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2013లో తిరిగి పంపిణీ కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీకి అనుమతించింది. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా చేప ప్రసాదం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే కొనసాగుతూ వస్తోంది. ఈసారి కూడా ఇక్కడే చేప ప్రసాదం పంపిణీ జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఒడిశా రైలు ప్రమాదంపై

# సీబీఐ దర్యాప్తు షురూ

**భువనేశ్వర్ - ప్రభాత సూర్యుడు** ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంపై దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించారు. రైలు ప్రమాదంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. రైలు ప్రమాదంపై విచారణ జరిపేందుకు సీబీఐ అధికారుల బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. ఒరిస్సాలోని బాలాసోర్ రైలు ప్రమాదం కేసులో రైల్వే యాక్ట్ సెక్షన్ లోని 337, 338, 304ఎ, 34, 153, 154, 175 సెక్షన్ల కింద ఎఫ్ ఐఆర్ నమోదు చేసింది సిబిఐ. ఈ ఎఫ్ఐఆర్‌లో విధించిన సెక్షన్ల గురించి సిబిఐ కాసేట్లో అధికారిక సమాచారాన్ని విడుదల చేసే అవకాశం ఉంది.ఒడిశాలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో 275 మంది మృతి చెందినట్లు ఒడిశా ప్రభుత్వం తెలిపింది. శుక్రవారం కోరమండల్ ఎక్స్ ప్రెస్ లూప్ లైన్ లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొనడంతో పాటు దానిలోని కొన్ని బోగీలు రెండో లైన్ గుండా వెళ్తున్న షాలిమార్ ఎక్స్ ప్రెస్ వెనుక బోగీలను ఢీకొన్నాయి.ఈ రైలు ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య మొదట 288గా ఒడిశా ప్రభుత్వం తెలిపింది. కొన్ని మృతదేహాలను రెండుసార్లు లెక్కించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పీకే జెనా తెలిపారు. తదుపరి పరిశీలన, బాలాసోర్ జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన నివేదిక తర్వాత మరణాల సంఖ్యను 275గా మార్చారు. క్షతగాత్రులు సోరో, బాలాసోర్, భద్రక్, కటక్‌లో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని జెనా తెలిపారు. ఇప్పటివరకు 793 మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కాగా, 382 మంది ప్రభుత్వ ఖర్చులతో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు 88 మృతదేహాలను గుర్తించామని, 78 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించామని, ఇంకా 187 మందిని గుర్తించాల్సి ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు మండిపడుతున్నాయి. సీబీఐ విచారణ ఉత్తర్వులు జారీ చేయడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేష్ స్పందిస్తూ.. ఇది హెడ్‌లైన్స్‌లో వచ్చేందుకు చేసే ప్రయత్నమే తప్ప వేరేది కాదని మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. దీనికి సంబంధించిన ఓ టైంటేబుల్‌ని కూడా ఆయన వివరించారు. 2016లో కాన్పూర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదాన్ని ప్రస్తావిస్తూ, దీనిపై ఎన్ఐఏ దర్యాప్తునకు ఆదేశించారని గుర్తు చేశారు. కానీ ఇంతవరకు ఏమీ దొరకలేదని అన్నారు. సీబీఐ విచారణ ప్రకటించక ముందే బాలాసోర్ రైలు ప్రమాదంపై రైల్వే సేఫ్టీ కమిషనర్ తన నివేదికను కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ట్వీట్ చేశారు. గడువును చేరుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇది హెడ్ లైన్ మేనేజ్ మెంట్ తప్ప మరేమీ కాదన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్

# పరీక్షల్లో స్మార్ట్ కాపీయింగ్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** తెలంగాణలో మరో క్యాపీయింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో కాపీయింగ్ జరిగినట్టు కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను కూడా అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ సెంటర్‌లో స్మార్ట్ కాపీయింగ్ జరిగినట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. చింతపల్లి చైతన్య కృష్ణ అనే విద్యార్థి తాను రాసిన జవాబులను వాట్సాప్ ద్వారా ఫ్రెండ్స్‌కు షేర్ చేశాడు. వివిధ ఎగ్జామ్స్ సెంటర్‌లలో పరీక్షలు రాస్తున్న నలుగురు ఫ్రెండ్స్‌కు ఇలా షేర్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. దేశంలోని 23 ఐఐటీల్లో సీట్ల కోసం ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరిగింది. ఆన్‌లైన్ విధానంలో జరిగిన పరీక్షలు ఈ విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడినట్టు వార్తలు వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 35 వేల మంది ఈ పరిక్ష రాశారు. ఈ కాపీయింగ్ పాల్పడిన విద్యార్థులంతా ఒకే కాలేజీకి చెందిన వారుగా గుర్తించారు. ప్యాట్నీలోని ఎస్‌వీఐటీ కాలేజీలో పరీక్ష రాసిన చైతన్య కృష్ణ... ఆన్సర్స్‌ను వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. వాటిని ఎల్బీనగర్, మల్లాపూర్, మౌలాలి కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న మిగతా ఫ్రెండ్స్ కాపీ చేశారు. చైతన్య కృష్ణ కదలికలపై అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్ చెక్ చేస్తే మొబైల్ లభించింది. అధికారులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చైతన్య కృష్ణను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు.

# రూ. లక్ష ఆర్థిక సాయం అందించే ప్రక్రియ మొదలు

### జూన్ 9న మంచిర్యాల జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్న సిఎం కేసీఆర్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. విశ్వబ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, రజక, కుమ్మరి, మేదరి వంటి కులవృత్తులు, చేతివృత్తులనే నమ్ముకొని జీవిస్తున్న వారికి రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందించాలని గత నెలలో జరిగిన కేబినెట్‌లో నిర్ణయించింది. ఇందుకు విధివిధానాలను వేగంగా రూపొందించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాల కులవృత్తులు, చేతివృత్తులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించే ప్రక్రియ మొదలైంది. ఇందుకోసం రూపొందించిన వెబ్‌సైట్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫోటో, ఆధార్, కుల ధృవీకరణ పత్రం సహా 38 కాలమ్‌లతో సరళమైన అప్లికేషన్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా తక్షణమే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కులవృత్తి, చేతివృత్తులకు సంబందించిన పనిముట్లు, ముడిసరకు కొనుగోలుకు ఈ ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాల జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజు అన్ని నియోజక వర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలచే లబ్దిదారులకు రూ.లక్ష పంపిణీ చేయనున్నారు.

# తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్..

### - ఖమ్మంలో అమిత్ షా..

### - నాగర్ కర్నూల్‌లో జేపీ నడ్డా భారీ భహిరంగ సభ..

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** కమలం పార్టీ.. ఆపరేషన్ మిషన్ సౌత్ స్టార్ట్ చేసింది. కర్నాటక ఎన్నికల తర్వాత.. ఇక తెలంగాణ నుంచే దండయాత్ర మొదలు పెట్టింది. రెండు సీట్లతో ప్రయాణం మొదలుపెట్టి.. రాజకీయాల్లో వన్ అండ్ ఓన్లీగా మారుతోంది బీజేపీ. ఉత్తరాది రాష్ట్రాల్లో విజయయాత్ర సాగిస్తోంది. పశ్చిమాన పట్టు సాధించింది. ఈశాన్య రాష్ట్రాలను ఒడిసి పట్టుకుంది. కమలానికి ఏదైనా అసంతృప్తి ఉంది అంటే.. అది దక్షిణాది రాష్ట్రాలతోనే.. కేవలం ఈ రాష్ట్రాల్లోనూ ఇప్పటివరకూ అధికారం దక్కించుకోలేకపోయింది. కనీసం చేరువకాలేకపోయింది. అలాంటిది ఇప్పుడు కమలనాథుల స్వరాలు కంచుకంఠంగా వినిపిస్తున్నాయి.రాబోయే ఎన్నికల్లో తెలంగాణ విజయ శంఖారావం పూరించాలనే లక్ష్యంగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ మొదలు పెట్టింది. మోదీ 9 ఏండ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించేందుకు 'మహాజన్ సంపర్క్ యాత్ర'లను ఎన్నికల శంఖారావ సభలుగా మార్చుకొనేందుకు రెడీ అవుతోంది. ఈ నెలలో నిర్వహించే సభల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొననున్నారు. జూన్ 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు. 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జూన్ 25న నాగర్ కర్నూల్‌లో జరిగే బహిరంగ సభలో జేపీ నడ్డా పాల్గొంటారు. నాగర్ కర్నూల్ బహిరంగ సభ ముగిసన తర్వాత కర్నాటక సరిహద్దు సెగ్మెంట్లలోని జహీరాబాద్ సెగ్మెంట్ లో నడ్డా పర్యటించే అవకాశం ఉందని సమాచారం.ఇదే ఈ నెలలో ముగ్గురు బీజేపీ అగ్రనేతలు తెలంగాణలో పర్యటించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో దక్షిణ తెలంగాణలో నల్లగొండ లేదా ఖమ్మం జిల్లాలో ఏదో ఒక చోట సభ నిర్వహించాలని పార్టీ వర్గాలు ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.ఇందులో కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని విజయాలను ప్రజలకు వివరించేందుకు బీజేపీ మరో ముందడుగు వేసింది. ప్రధాని ప్రజలకు చేసిన సేవలను వివరించి మరోసారి దీవించాలని, ప్రజల్లోకి వెళ్లేందుకు బీజేపీ 'మహాజన్ సంపర్క్ అభియాన్' పేరిట దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

## శంషాబాద్ లో మరోసారి బంగారం పట్టివేత



రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు

శంషాబాద్ విమానాశ్రయంలో మరోసారి భారీగా బంగారం పట్టుబడింది. దుబాయ్ నుండి హైదరాబాద్ వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుండి సినీ ఫక్కీలో కిలోన్నరకు పైగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు కస్టమ్స్ అధికారులు. దుబాయ్ నుండి ఇండిగో విమానంలో హైదరాబాద్ వచ్చిన ఇద్దరు నిందితులు బంగారాన్ని పేస్టు గా మార్చి ఆరు క్యాప్సిల్స్ రూపంలో మలద్వారంలో అమర్చుకొని వచ్చారు. అయితే శంషాబాద్ విమానాశ్రయంలో విమానం దిగిన వీరిద్దరి ప్రవర్తన పై అనుమానం రావడంతో ఫిజికల్ స్కానింగ్ నిర్వహించారు. ఇంకేముంది మలద్వారంలో బంగారం అమర్చుకుని వచ్చినట్టు గుర్తించిన కస్టమ్స్ అధికారులు నిందితులను ఆసుపత్రికి తరలించి ఆరు క్యాప్సిల్స్ ను బయటకు తీశారు. ఆరు క్యాప్సిల్స్ లో అమర్చిన 1705 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు నిందితులపై బంగారం అక్రమ రవాణా కింద కేసు నమోదు చేశారు. పట్టుబడిన బంగారం విలువ ఒక కోటి 5 లక్షలు ఉంటుందని కస్టమ్స్ అధికారులు ప్రకటించారు.

## మాజీ ఎమ్మెల్యే పాయంపై రేగా వ్యాఖ్యలు

భద్రాద్రి కొత్తగూడెం – ప్రభాత సూర్యుడు

పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య పై పినపాక తాజా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేశారు. 2 సార్లు నా చేతిలో ఓటమి చెందాడు ముచ్చటగా 3వ సారి సిద్ధంగా ఉన్నాడు. ఎన్ని జాకీలు పెట్టి లేపిన మాయం లెవడం లేదు అంటూ ఎద్దేవా చేసారు. మాయాన్ని లేపటానికి బ్రహ్మ కంపెనీ పడని తిప్పలు లేవు. అనేక కంపెనీలను సందర్శించినా ఏ కంపెనీ అయినా ఔట్ డేటెడ్ పనికిరాదు అంటున్నారు. కొత్త బండి కోసం తీవ్ర ప్రయత్నం. ఎన్నికల వరకే వీరి హడా విడి తరువాత అన్ని కంపెనీల గుర్తింపు రద్దవుతాయి. మిగిలేది రేగా బ్రాండ్ మాత్రమే.అందుబాటులో ఉండేది రేగానే. 2018 తర్వాత ని ఇంటి ముందర రోడ్డు నేనె వేయించా . ఇప్పుడు 9 కోట్లతో డబుల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ కు నిన్ననే శంకుస్థాపన చేసా. వెలుతురులో అష్టా చెమ్మ అడుకో..నీ వల్ల షాడో కె లాభం తప్ప ప్రజలకు ఏమి లాభమని అయన పేర్కొన్నారు.

## అపార్ట్ మెంట్ పైనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ మహల్ లో అపార్ట్మెంట్ పైనుంచి దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అరవింద్ రెసిడెన్సి లో నివాసం ఉండే ఏం కేశవరెడ్డి 87 సంవత్సరాలు ఇతనికి భార్య ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. కేశవరెడ్డికి మానసిక స్థితి బాగాలేదుగత సంవత్సర కాలంగా చాలా ఇబ్బందులు పడుతున్నాడు.. కేశవరెడ్డి చిన్న కుమారుడు కుమార్తె అమెరికాలో నివాసం ఉంటుండగా పెద్ద కుమారుడు హైదరాబాదులో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నారు. తండ్రిని చూడడానికి ఇటీవలే కేశవరెడ్డి కుమార్తె అమెరికా నుంచి హైదరాబాద్ కు వచ్చింది.మంగళవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కేశవరెడ్డి ఒక్కడే అపార్ట్మెంట్పై ఉన్న టెర్రస్ పైకి వెళ్లి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు హుటాహుటిగా సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం రప్పించి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శం....

### మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ముషీరాబాద్ లోని వివిస్టీ వర్కర్స్ యూనియన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తలసాని, ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా తెలంగాణ రాష్ట్రం వుంది. అమెజాన్, యాపిల్ వంటి అనేక దిగ్గజ సంస్థలు తెలంగాణ లో సంస్థలు ఏర్పాటు చేశాయి. నూతన పరిశ్రమల ఏర్పాటుతో 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు.

## సర్కారు బడికే సై

**-కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు.....**

**-ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య....ఊరురా బడిబాట**

తాండూర్– ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాసిపేట పాఠశాల ఉపాధ్యా యుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్తూ ప్రతి ఒక్క విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలకు రావాలని ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యా యులచే విద్యా బోధన ,రుచికరమైన మధ్యాహ్న భోజనం, రెండు చేతుల స్కూల్ యూనిఫాం ,ఉచిత పాఠ్య పుస్తకాలు, పద్ధతిలో నాణ్యమైన విద్య బోధన ఆదరించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు మరింత అభివృద్ధి చెందుతున్నాయని, తల్లిదండ్రులపై ఫీజుల భారం లేకుండా ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్నామని పిల్లలకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ద్వారకాపూర్ సర్పంచ్ మాసాడి శారదా,పాఠశాల ఉపాధ్యాయులు పున్నం చంద్, పద్మ,రాజలక్ష్మి, నళిని, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు



బస్తీ దవాఖాన, మహిళ భవనం ప్రారంభించిన అనంతరం ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

ప్రజల ఆరోగ్యానికే తెలంగాణ ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యత కల్పిస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం తుర్క యంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూర్, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ



కుంట్లూర్లో బస్తీ దవాఖాన, మహిళా భవనములను మంగళ వారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పట్టణాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన పేద ప్రజల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తుందని, అందుకు నిదర్శనం కంటి వెలుగు, బస్తీ దవాఖానలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో తుర్క యంజల్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్రెడ్డి అనురాధ రాంరెడ్డి, పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి, రంగా రెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, మున్సిపల్ వైస్ చైర్పర్సన్లు గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, ఛామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కమిషనర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సాగు నీటి దినోత్సవం నిర్వహించాలి

**- జూన్ 7న అన్నారం బ్యారేజి వద్ద లేజర్ లైట్ షో**

**- గాయని మంగలి చే స్పెషల్ ప్రోగ్రాం**

**- అన్నారం బ్యారేజి ఇరువైపులా విద్యుత్ దీపాలతో అలంకరించాలి**

**- సాగు నీటి దినోత్సవం నిర్వహణ పై అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

జయశంకర్ భూపాలపల్లి – ప్రభాత సూర్యుడు



జిల్లాలో సాగునీటి దినోత్సవాన్ని సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించాలని, దానికి తగిన విధంగా అన్నారం బ్యారేజ్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధించిన అధికారులను ఆదేశించారు. సాగునీటి దినోత్సవం వేడుకల నిర్వహణ పై మంగళవారం నీటి పారుదల శాఖ, ఇతర జిల్లా అధికారులతో కలిసి అన్నారం బ్యారేజీని కలెక్టర్ సందర్శించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జూన్ 7వ తేదీ సాయంత్రం అన్నారం బ్యారేజ్ వద్ద నిర్వహించే సాగు నీటి దినోత్సవం కార్యక్రమాన్నీ అంగ రంగ వైభవంగా నిర్వహిచాలని అన్నారు. జూన్ 7న సాయంత్రం 5.30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, రంజిత బృందంచే పేరిణి శివ తాండవం, శ్రవ్య మానస బృందం చే శాస్త్రీయ నృత్య ప్రదర్శన, లేజర్ లైట్ షో, మంత్రుల సందేశాలు, నేపథ్య గాయని మంగ్లీ బృందం మ్యూజికల్ లైవ్ షో కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. సాగినీటి దినోత్సవ వేడుకలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి జన సమీకరణ చేయాలని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్,ఎం ఎల్ ఏ లు,ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారని కలెక్టర్ అన్నారు . సాగునీటి దినోత్సవ కార్యక్రమంలో సినీ గాయకురాలు మంగ్లీ, జానపద కళాకారులు, ప్రేరిణి నృత్యం,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచడం జరుగుతుందని, జిల్లాకు వచ్చే అతిథులకు ,అధికారులకు, ప్రజలకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఇరిగేషన్ అధికారులు అన్నారం బ్యారేజ్ కి ఇరు వైపులా విద్యుత్ లైటింగ్తో అద్భుతంగా అలంకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్, మరియు బ్యారేజ్ లో నీరు కనబడేలా సెల్ఫీ వ్యూను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. సాగునీటి దినోత్సవం కార్యక్రమానికి మంత్రులు ప్రముఖ గాయకులు, విఐపి లు వస్తున్నందున పటిష్ట బందోబస్తు , పార్కింగ్, బారికేడింగ్, ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జడ్పి చైర్మన్ శ్రీహర్షిణీ, ఎంపీపీ బి.రాణీ బాయి, జెడ్పీటీసీ అరుణ, అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ప్రోగ్రాం ఈవెంట్ మేనేజర్, రవి, జిల్లా అధికారులు , సర్పంచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గుండా నాగరాజుకి ఘన నివాళులు

మంథని – ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అమరుడైన గుండా నాగరాజు 10వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మంథని బస్టాండ్ ముందు గల గుండా నాగరాజు విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంథని మున్సిపల్ ఛైర్ పర్సన్,పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట శైలజ–మదుకర్ దంపతుల ఆదేశాల మేరకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సముద్రాల శ్రీనివాస్ నాయకులు కొమురవెల్లి విజయ్ కుమార్, ఇల్లెందుల సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు మంథని ఎంపీపీ కొండా శంకర్, మంథని సింగిల్విండో చైర్మన్ శ్రీ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు వికే రవి, కాయితి సమ్మయ్య, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు యెగోళపు శంకర్ గౌడ్, రైతు బంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్ నాయకులు కొట్టే రమేష్, నక్క శంకర్, గుండా పాపా రావు, వేల్పుల గట్టయ్య, అప్పాల పోచ మల్లు, కొండా రవీందర్, బత్తుల సత్య నారాయణ, మెడగొని రాజ మౌళి గౌడ్, ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్, తిరుపతి లతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొని అమర వీరుడు గుండా నాగరాజుకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. గుండా నాగరాజు కుటుంబానికి జడ్పీ చైర్మన్ పుట్ట మధు సహకారంతో తమంత ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు.

## మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్ – ప్రభాత సూర్యుడు

మద్యం మత్తులో ఫ్లై ఓవర్ పై నుండి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల భూక్యా అశోక్ అనే వ్యక్తి వెల్డింగ్ షాపులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. రేష్మా బేగంను అనే మహిళను ప్రేమ వివాహం చేసుకొని, కోమటి బస్తీలో నివసిస్తున్నాడు. ప్రతి రోజు మద్యం సేవించి భార్యను కొడుతూ, మద్య మత్తులో తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించటమే కాకుండా, గతంలో రెండు సార్లు బ్లేడుతో కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ రోజు ఉదయం మద్యం సేవించి భార్యను కొట్టి, ఆత్మహత్య చేసుకుంటానని ఇంటిలో నుండి వెళ్ళిపోయాడు. అశోక్ మధ్యాహ్నం సమయంలో బాలానగర్ ఫ్లై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణ యూనివర్సిటీలో విజిలన్స్ సోదాలు

నిజామాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల దాడులు కలకలం రేపుతున్నాయి. అకౌంట్స్ ,ఎస్టాబ్లిష్ మెంట్ బిల్డింగ్ సెక్షన్స్ ఏవో కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తు న్నారు.యూనివర్సిటీలో గత కొంత కాలంగా అక్రమాలపై ఆరోపణల నేపథ్యంలో దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యూనివర్సిటీలో అక్రమ నియామకాలు అక్రమ లావాదేవీలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు అధికారులు.20 మందితో కూడిన ప్రత్యేక బృందాలు తనికీలు నిర్వహిస్తున్నాయి

## ఔటర్రింగ్ రోడ్డులో ప్రమాదం- ఒకరు మృతి

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు



రంగారెడ్డి జిల్లా నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఔటర్ రింగ్ రోడ్ పై టాటా ఏస్ వాహనం పల్టీ కొట్టింది. టాటా ఏస్ వాహనం లో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందాడు. ఐదు మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని హుటాహుటిన 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. ) మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని సమాచారం. శంషాబాద్ నుండి గచ్చిబౌలిలోని కన్వెన్షన్ హాలుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215